అభివృద్ధికి అందరూ సహకరించాలి

• పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి

గుమ్మడిదల, జూన్ 9: అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. గుమ్మడిదల మండలం, మున్సిపల్ పరిధిలోని బొంతపల్లి వీరభద్ర స్వామి ఆలయం నుంచి గుమ్మడిదల వరకు రూ. 2.90 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు, అన్నారం నుంచి ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీ వరకు రూ.1.10 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు, కొత్తపల్లి నుంచి నాగిరెడ్డి మీదుగా శివాయిగూడ వరకు రూ. 1.80 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డుకు, గుమ్మడిదల నుంచి నాగిరెడ్డిగూడ మీదుగా కొత్తపల్లి వరకు రూ.2.05 కోట్లతో బీటీ రోడ్డు పనులకు, రామిరెడ్డి బావి నుంచి కానుకుంట వయా వీరారెడ్డిపల్లి–మొల్లగూడ వరకు రూ. 2.40 కోట్ల నిధులతో బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్సీ సీహెచ్ అంజిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం జాతీయ రహదారి నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు రూ.45 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రా రంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మా ట్లాడుతూ.. పార్టీకతీతంగా ముందుకు నడిస్తే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్ డీ సురేశ్, షేక్‌హుస్సేన్, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు విజయభాస్కర్‌రెడ్డి, వీరారెడ్డి, పుట్ట నర్సింగ్‌రావు, కావలి ఐలయ్య, మహ్మద్‌హుస్సేన్,నాగేందర్ గౌడ్, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నబోయిన వేణు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, జూన్ 9: నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పేట్‌కు చెందిన భోగ రవీందర్‌కు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కును సోమవారం మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆయనకు అందజేశారు. ఆరోగ్యశ్రీ పథకం వర్తించని పరిస్థితుల్లో ప్రైవేట్ దవాఖానల్లో చికిత్స పొందిన నిరుపేదలను ఆదుకునే దిశగా బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధుల సహకారంతో సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు భూపాల్‌రెడ్డి తెలిపారు.

జర్నలిస్టుల పిల్లలకు రాయితీ ఇవ్వాలి

డీఈవో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న టీయూడబ్ల్యూజే ప్రతినిధులు

సంగారెడ్డి, జూన్ 9: ప్రభుత్వం జర్నలిస్టుల పిల్లలకు విద్యారంగంలో రాయితీలు అమలు చేయాలని, డీఈవోల ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలు కాకపోవడంతో ప్రతి ఏడాది డీఈవోలకు వినతి పత్రాలు ఇవ్వాల్సిన పరిస్థితి వస్తున్నదని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి అన్నారు. సోమవారం సంగారెడ్డిలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ .. తమ సంఘం జర్నలిస్టుల సంక్షేమానికి పాటుపడుతోందన్నారు. జర్నలిస్టుల్లో పేద, మధ్యతరగతి వర్గాలవారే ఎక్కువ మంది ఉన్నారని, వారి పిల్లలకు మెరుగైన అందించేందుకు ప్రైవేటు విద్యాసంస్థల్లో చేర్పిస్తే అధిక ఫీజులతో ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ప్రధాన కార్యదర్శి విష్ణుప్రసాద్, మహమ్మద్ సిద్ధిక్, ఆరీఫ్, రవీందర్, పరంజ్యోతి, నాగరాజుగౌడ్, రాజుగౌడ్ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలు పరిష్కరిస్తా

సాయిగణేశ్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్

పటాన్‌చెరు, జూన్ 9: పటాన్ చెరు డివిజన్ పరిధిలోని సాయిగణేశ్ కాలనీలో డ్రైనేజ్ సమస్య పరిష్కరిస్తానని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ హామీ ఇచ్చారు. సోమవారం కాలనీలో ఆయన పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో పలుచోట్ల డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగు రోడ్లపై ప్రవహిస్తున్నదని కాలనీవాసులు తెలిపారు. మురుగు రోడ్లపై ప్రవహించడంతో సీసీ రోడ్లు దెబ్బతిన్నాయని, గుంతలతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు వివరించారు. జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సూపర్‌వైజర్ పవన్, రాఖీ, విజయ్ కుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు

బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సంగారెడ్డి/సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 9: బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులకు మెరుగైన సేవలను అందించనున్నట్టు బీఎస్‌ఎన్‌ఎల్ ఏజీఎం జగన్‌రావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక బైపాస్ రోడ్డులోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయ ఆవరణలో వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ క్రైమ్, ఫ్రాడ్‌కాల్స్ అంశాలపై అవగాహన కల్పించారు. వినియోగదారులకు ఎలాంటి సమస్యలు తలెత్తినా పరిష్కరించడం జరుగుతుందన్నారు. బీఎస్‌ఎన్‌ఎల్ సిబ్బంది లక్ష్మినారాయణ, రాఘవేంద్ర, శ్రీనివాస్, సత్యవేలు, సతీష్, సంతోష్, యాదయ్య పాల్గొన్నారు.

రేషన్ షాపుల వద్ద బారులు

పుల్కల్‌లో బారులుదీరిన వినియోగదారులు

పుల్కల్,జూన్ 9 : రేషన్ షాపుల వద్ద కార్డుదారులు బారులు తీరుతున్నారు. మూడు నెలల రేషన్ ఒకేసారి పంపిణీ చేస్తుండడంతో షాప్‌ల వద్ద రద్దీ నెలకొంటున్నది. మండల కేంద్రం పుల్కల్‌లో రేషన్‌షాప్ నంబర్–2 వద్ద సోమవారం రద్దీ ఎక్కువగా కనిపించింది. దీనికి తోడు సర్వర్ డౌన్ రావడంతో ఒక్కో వ్యక్తికి వేలిముద్ర స్కాన్ కాక పోవడంతో కనీసం పది నిమిషాల సమయం పట్టింది. దీంతో గంటల పాటు కార్డుదారులు నిరీక్షించాల్సి వచ్చింది.

విచ్చలవిడిగా ఎరువులు వాడొద్దు

రాయికోడ్, జూన్ 9 : వానకాలంలో పత్తి సాగుపై రైతులకు సోమవారం మండల వ్యవసాయ శాఖ అధికారి సారికరెడ్డి అవగాహన కల్పించారు. రాయికోడ్‌లోని రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్ర వేతలు అన్నదాతల అవగాహన సదస్సును నిర్వహించారు. మండల వ్యవసాయధికారి సారికరెడ్డి మాట్లాడుతూ.. రైతులు పత్తి పంటలో యూరియా తక్కువ వాడాలన్నారు. ఎక్కువగా రసాయనిక ఎరువులు వాడితే దిగుబడులపై ప్రభావం చూపుతుందన్నారు. సమావేశంలో బసంతపూర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేతలు విజయలక్ష్మి, పద్మ, ఉద్యాన శాఖ అధికారి మౌనికరెడ్డి, ఏఈవోలు పాల్గొన్నారు.

గల్ఫ్‌లో మహనీయుల జయంతి

దుబాయ్‌లో మట్టి మేధావి సత్తయ్య పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న భరత్

రామచంద్రాపురం, జూన్ 9: దుబాయిలో అంబేద్కర్ రైట్స్ మూమెంట్ సంస్థ ఆధ్వర్యంలో మహనీయులైన ఛత్రపతి శివాజీ, మహాత్మాజ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఆస్క్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి కొల్లూరి భరత్ ముఖ్య వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్ రచించిన మట్టి మేధావి సత్తయ్య జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

జిన్నారం: నల్లూరులో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న డీటీ మల్లికార్జున్, సిబ్బంది

రాయికోడ్: జంబ్గి(కె)లో రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆశాజ్యోతి

సిర్గాపూర్: ఖాజాపూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న గిర్దావర్ మదన్

అమీన్‌పూర్, జూన్ 9: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో సోమవారం భూభారతి రెవెన్యూ అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో పలువురు రైతులు పాల్గొని తమ భూ సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. భూ సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ హరిప్రసాద్, ఆర్ఐలు రఘునాథరెడ్డి, శ్రీమాన్ రాజు పాల్గొన్నారు.

కాజీపల్లి, నల్లూరులో రెవెన్యూ సదస్సులు

జిన్నారం, జూన్ 9: జిన్నారం మండలంలోని కాజీపల్లి, నల్లూరు గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కాజీపల్లిలో తహసీల్దార్ దేవదాస్ బృందం, నల్లూరులో డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున్ బృందాలు రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించాయి. సదస్సుల్లో ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ, సిబ్బంది మౌలాలి, స్వప్న, రైతులు, స్థానికులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలి

రాయికోడ్, జూన్ 9: రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకు భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని రాయికోడ్ తహసీల్దార్ ఆశాజ్యోతి అన్నారు. సోమవారం మండలంలోని జంబ్గి(కె), మామిడిపల్లిలో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ విజయకుమార్, ఆర్ఐ శ్రీకాంత్, సిబ్బంది, మాజీ సర్పంచ్‌లు నవీన్ కుమార్, వెంకట్‌రెడ్డి, శ్రీశైలం, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు

సిర్గాపూర్, జూన్ 9 : మండలంలోని పోచాపూర్, ఖాజాపూర్ గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ హేమంత్‌కుమార్ పోచాపూర్‌లో, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మదన్ ఖాజాపూర్‌లో సదస్సు నిర్వహిచారు. పోచాపూర్‌లో 17, ఖాజాపూర్‌లో 8 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ చెప్పారు. ఇప్పటి వరకు 10 గ్రామాల్లో జరిగిన సదస్సుల్లో మొత్తం 159 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు, స్థానికులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు పెట్రోల్ బంక్‌లు

• కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి: కలెక్టర్ వాహనానికి డీజిల్ పోయించుకుని డబ్బులు చెల్లిస్తున్న కలెక్టర్

సదాశివపేట: కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

సంగారెడ్డి, జూన్ 9: మహిళల మహారాణులు అని, వారి గౌరవాన్ని మరింత పెంచేందుకు ప్రభుత్వం మహిళా సంఘాలకు పెట్రోల్ బంక్ నిర్వహణను అప్పగించిందని కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ నిర్వహణను సోమవారం కలెక్టర్ పరిశీలించారు. త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలో పెట్రోల్ బంక్ మొదటిసారిగా మహిళలతో నడిపించబోతున్నట్లు తెలిపారు. బైపాస్ రోడ్డులో పెట్రోలు బంకు నిర్మాణం ఇప్పటికే పూర్తయిందని, ఇందులో 14మంది మహిళా సిబ్బంది పనిచేస్తున్నారని, అందు లో ఇద్దరు మహిళలు మేనేజర్లుగా, 12మంది ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పెట్రోల్ బంకు నిర్వహణతో మహిళల కుటుంబాలు ఆర్థికంగా బలపడే అవకాశాలు ఉన్నాయన్నారు. కలెక్టర్ వాహనంలో డీజిల్ పోయించుకుని సొంత డబ్బులను కలెక్టర్ క్రాంతి చెల్లించారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీవో పీడీ జ్యోతి, అదనపు పీడీ జంగారెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

హెచ్‌ఎంను అభినందించిన కలెక్టర్

సదాశివపేట, జూన్ 9: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ బోర్డు హైదరాబాద్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి గ్రీన్ చాంపియన్ పురస్కారం 2025 అందుకున్న మండలంలోని నిజాంపూర్(కె) ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణను సోమవారం కలెక్టర్ వల్లూరు క్రాంతి అభినందించారు. అనంతరం నిజాంపూర్(కె) పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, జిల్లా సెక్టోరియల్ అధికారి వెంకటేశం, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ బాలయ్య, జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి, ఎంఈవో శంకర్ పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎస్సై

ఎస్పీని కలిసిన జహీరాబాద్ ఎస్ఐ వినయ్‌కుమార్

జహీరాబాద్, జూన్ 9 : జహీరాబాద్ పట్టణ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన వినయ్‌కుమార్ సోమవారం జిల్లా ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ పారితోష్ పంకజ్ ఎస్ఐ వినయ్‌కుమార్‌ను అభినందించారు. శాంతి భద్రతలను కాపాడేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

జహీరాబాద్ డిపో నుంచి ప్రత్యేక బస్సులు

జహీరాబాద్, జూన్ 9: జహీరాబాద్ ఆర్టీసీ డిపో నుంచి దైవ దర్శనాల కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని డిపో మేనేజర్ టి.స్వామి పేర్కొన్నారు. డిపో నుంచి యాదగిరిగుట్టకు ప్రతిరోజు ఉదయం 7 గంటలకు బయలుదేరి 10 గంటలకు బస్సు చేరుకుంటుందని తెలిపారు. భక్తుల దర్శన అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు భువనగిరిలోని స్వర్ణగిరి ఆలయ దర్శనం తర్వాత రాత్రి 7 గంటలకు బయలుదేరి రాత్రి 11 గంటలకు జహీరాబాద్‌కు చేరుకుంటుందని తెలిపారు. ప్రతి పౌర్ణమికి కర్ణాటకలోని గాణుగాపూర్‌లోని దత్తాత్రేయ స్వామి ఆలయానికి వెళ్లేందుకు జహీరాబాద్ బస్టాండ్ నుంచి సాయంతం 4 గంటలకు బయలుదేరి రాత్రి 8 గంటలకు చేరుకుంటుందన్నారు. మరుసటి రోజు ఉదయం 7 గంటలకు బయలుదేరి 11 గంటలకు జహీరాబాద్‌కు చేరుకుంటుందని చెప్పారు. భక్తుల కోసం డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈనెల 10న గాణుగాపూర్ దత్తాత్రేయ స్వామి దర్శన నిమిత్తం వెళ్లే భక్తుల కోసం బస్సు నడుపుతున్నట్టు పేర్కొన్నారు. ఈ బస్సు బస్టాండ్‌లో సాయంత్రం 7 గంటలకు బయలుదేరి రాత్రి 11 గంటలకు చేరుకుంటుందన్నారు. ఆసక్తిగల భక్తులు అదనపు సమాచారం కోసం సెల్‌ఫోన్ నంబర్లు 96761 61161, 9121418750, 94940 93486, 99592 26269లకు సంప్రదించాలని సూచించారు.

తహసీల్ భవనానికి నిధులు కేటాయించండి

ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

గుమ్మడిదల, జూన్ 9: గుమ్మడిదల మండలంలో ఏండ్లు గడుస్తున్నా తహసీల్ కార్యాలయానికి భవనం లేదని, దీనికోసం నిధులు కేటాయించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్ , మండల నాయకులు సత్య విజయ భాస్కర్‌రెడ్డి తదితరులు సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మండల నాయకులు మహమ్మద్ హుస్సేన్, తుపాకుల రాజు, మురళి, కరుణాకర్‌గౌడ్, సంఘం శేఖర్‌గౌడ్, రవికాంత్‌రెడ్డి ఉన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

సిర్గాపూర్, జూన్ 9: బడీడు పిల్లలను సర్కారు బడిలో చేర్పించాలని ఎంఈవో నాగారం శ్రీనివాస్ తెలిపారు. సోమవారం సిర్గాపూర్‌లో ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి బడీడు పిల్లలను గుర్తించి పేర్లను నమోదు చేసుకున్నారు. సర్కారు బడిలో విద్యార్థులకు అందించే నాణ్యమైన విద్య, రుచికరమైన మధ్యాహ్న భోజనం, తదితర వసతులపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం సర్కారు బడి విశేషాలపై పేర్కొన్న కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీ శివకుమార్‌స్వామి, హెచ్‌ఎం, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్

ఆటోడ్రైవర్ ఖదీర్‌ను అభినందించిన ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి, జూన్ 9 : ఆటోలో మరిచిపోయిన నగదు, బంగారు నగల బ్యాగును తిరిగి అప్పగించి ఆటోడ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. వివరాలు.. మల్కాపూర్ చౌరస్తాలో నివాసం ఉంటున్న సంఘగోని శ్రీనివాస్ సోమవారం తన కుటుంబంతో కల్హేర్ మండలంలో శుభ కార్యానికి వెళ్లేందుకు సంగారెడ్డి కొత్తబస్టాండ్ వద్ద ఆటోఎక్కాడు. ఆటో దిగేపోయే సమయంలో బంగారు నగలు, నగదుతో పాటు బ్యాగును ఆటోలో మరిచిపోయాడు. వాటిని గమనించిన ఆటో డ్రైవర్ షేక్ ఖదీర్ వెంటనే పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వాటిని అప్పగించారు. బాధితుడు శ్రీనివాస్‌గౌడ్ నేరుగా పోలీస్ స్టేషన్ రాగా, పోలీస్ స్టేషన్‌లో తన బ్యాగును చూసిన ఆనందానికి లోనయ్యాడు. నాల్‌సాబ్‌గడ్డకు చెందిన ఆటో డ్రైవర్ షేక్ ఖదీర్ బ్యాగును అప్పగించడంతో ఎస్పీ డ్రైవర్‌ను అభినందించి నగదు బహుమతి అందజేశారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేశ్, ప్రయాణికుడు సంఘగోని శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

ఎస్సైకి ఉద్యోగోన్నతి

ఎస్సైకు బ్యాడ్జ్ తొడుగుతున్న ఎస్పీ

సిర్గాపూర్, జూన్ 9: సిర్గాపూర్ ఎస్సై వెంకట్‌రెడ్డి ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందారు. సోమవారం ఆయనకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ పరితోష్ పంకజ్ ఉద్యోగోన్నతి ర్యాంకు బ్యాడ్జ్‌ను తొడిగి శుభాకాంక్షలు తెలిపారు. ప్రమోషన్‌తో బాధ్యత మరింత పెరిగిందని, విధి నిర్వరణలో మరింత క్రమశిక్షణతో పనిచేసి పోలీస్‌శాఖకు మంచిపేరు తేవాలని ఎస్పీ సూచించారని ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. ప్రజల్లో పోలీసుశాఖపై ఉన్న నమ్మకాన్ని, గౌరవాన్ని మరింతగా పెంచేందుకు కృషిచేస్తానని వెంకట్‌రెడ్డి తెలిపారు.

శివానగర్‌లో ముదిరాజ్ భవనం ప్రారంభం

ముదిరాజ్ సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న నీలం మధు ముదిరాజ్

జిన్నారం, జూన్ 9: పటాన్‌చెరు నియోజకవర్గంలోని ముదిరాజుల సంక్షేమానికి సంపూర్ణ సహకారం అందిస్తామని ఎన్‌ఎంఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. సోమవారం మండలంలోని శివాజీనగర్‌లో తన సొంత డబ్బులు రూ.15 లక్షలతో నిర్మించిన ముదిరాజ్ సంఘం భవనాన్ని మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం నీలం మధు ముదిరాజును, మాజీ ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్, మాజీ ప్రజాప్రతినిధులు, ముదిరాజ్ సంఘం నాయకులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

సజ్జాపూర్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

కోహీర్, జూన్ 9 : మండలంలోని సజ్జాపూర్‌లో సోమవారం సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ.10లక్షలు, బీసీ కాలనీలో రూ.5లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త ప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అడివిరెడ్డి, వినోద్‌కుమార్ రాథోడ్ పాల్గొన్నారు.

సంగారెడ్డి జట్టు విజయం

పోటీల్లో గెలుపొందిన సంగారెడ్డి జిల్లా జట్టు

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 9: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న అండర్–25 ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్ మ్యాచ్‌ల్లో భాగంగా సోమవారం కొండాపూర్ మండలం సీ కోనాపూర్‌లోని ఎంఏ క్రికెట్ మైదానంలో సంగారెడ్డి ఏ జట్టు, సిద్దిపేట బీ జట్ల మధ్య పోటీ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన సిదిపేట బీ జట్టు 22.5 ఒవర్లలో 100 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన సంగారెడ్డి ఏ జట్టు కేవలం 22.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 101 పరుగులు చేసి విజయం సాధించింది. సంగారెడ్డి ఏ జట్టు ఇప్పటి వరకు 5 మ్యాచ్‌లలో ఒకే ఒక ఓటమితో లీగ్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచింది. పోటీలను ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్‌రెడ్డి పర్యవేక్షించారు.

ఇందిరమ్మ ఇండ్లకు భూమిపూజ

భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

పుల్కల్, జూన్ 9: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఇందిరమ్మ ఇండ్లకు అధికారులు,నాయకులు భూమిపూజ చేశారు. సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోలేని స్థితిలో ఉన్న నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుర్గారెడ్డి తెలిపారు. సోమవారం కోడూరులో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందజేసి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. పుల్కల్‌లో లబ్ధిదారుడు భట్టు సుమన్ రాజు ఇంటి నిర్మాణానికి నాయకులు భూమిపూజ చేశారు.కార్యక్రమంలో ఎంపీవో శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్, భార్గవి, నాయకులు రాంచంద్రారెడ్డి, గోవర్ధన్, బోయిని శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బచ్చమల్ల ఉదయ్ కుమార్,రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు తెలపాలి

జిన్నారం, జూన్ 9: ఓటరు జాబితాలపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని గడ్డపోతారం మున్సిపల్ కమిషనర్ జైత్రం నాయక్ కోరారు. కొత్తగా ఏర్పాటైన గడ్డపోతారం మున్సిపాలిటీలోని కాజీపల్లి, మాదారం, వావిలాల, గడ్డపోతారం, లక్ష్మీపతిగూడెం గ్రామాల్లో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం 11:30 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో మాజీ ప్రజాప్రతినిధులు, అఖిలపక్ష నాయకులతో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 వార్డులకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే సమావేశంలో పాల్గొని వ్యక్తపరచాలని సూచించారు. సమావేశానికి మాజీ ప్రజాప్రతినిధులు, అఖిలపక్ష నాయకులు, యువకులు, గ్రామాల ప్రజలు సకాలంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఇంటర్‌లో ప్రవేశానికి నేడు కౌన్సిలింగ్

నారాయణఖేడ్, జూన్ 9: నారాయణఖేడ్ గిరిజన గురుకుల విద్యాలయంలో ఇంటర్మీడియట్ ఎంపీసీ, బీపీసీ గ్రూపుల్లో మిగిలిపోయిన సీట్లలో ప్రవేశం కోసం ఈనెల 10న ఉదయం 10 గంటలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యాదగిరి తెలిపారు. ఇందు కోసం 2024–25 విద్యాసంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు బదిలీ ధ్రువపత్రం, పదో తరగతి మార్కుల మెమో, స్టడీ, కండక్ట్ ధ్రువపత్రం, కుల ధ్రువీకరణ పత్రం, రూ.2 లక్షలకు మించకుండా ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, పీహెచ్‌సీ ధ్రువపత్రం, మూడు ఫొటోలతో నారాయణఖేడ్‌లోని బాలుర గిరిజన గురుకుల విద్యాలయంలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

వికసించిన బ్రహ్మ కమలం

వికసించిన బ్రహ్మకమలం పూలు

జహీరాబాద్, జూన్ 9: అరుదైన బ్రహ్మకమలం పుష్పం జహీరాబాద్ పట్టణంలోని ఓ ఇంట్లోని పెరట్లో వికసించింది. ఆదివారం రాత్రి జహీరాబాద్ పట్టణంలోని రైల్వే స్టేషన్ మేనేజర్ మాధవకృష్ణ ఇంట్లోని పెరట్లో ఉన్న చెట్టుకు బ్రహ్మకమలం పూలు పూశాయి. దీంతో మాధవకృష్ణ కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. సరస్వతీ దేవికి అతి ప్రీతిపాత్రమైన బ్రహ్మకమలం పూలు తమ పెరట్లో వీక్షించడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

మాడ్గి చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న అధికారులు

జహీరాబాద్, జూన్ 9: జహీరాబాద్ నియోజకవర్గంలోని చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తెలంగాణ–కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోని మాడ్గి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద మహారాష్ట్ర, గోవా ప్రాంతాల నుంచి వస్తున్న వాహనాలను జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు చేపట్టింది. సోమవారం ఉదయం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం ఆదేశాల మేరకు చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ముంబాయి, గోవా నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు, కార్లలో అక్రమంగా తరలిస్తున్న 17 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో సిబ్బంది భిక్షపతి, బాలరాజ్, హన్మంతు, మల్లికార్జునబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ ఇప్పించండి సారూ



పింఛన్ ఇప్పించాలని కలెక్టరేట్‌కు వచ్చిన వృద్ధురాలు

సిర్గాపూర్, జూన్ 9: వృద్ధాప్యం, వితంతువు అయినప్పటికీ పింఛన్ మంజూరు చేయడంలో మండల అధికారులు జాప్యం చేస్తున్నారని మండలంలోని అంతర్గాంకు చెందిన కంత్రపల్లి భద్రవ్వ ఆవేదన వ్యక్తం చేసింది. సోమవారం సంగారెడ్డి కలెక్టర్ ఆఫీసుకు తన కొడుకుతో పాటు వచ్చి పింఛన్ ఇప్పించండి సారూ.. అంటూ ప్రజావాణిలో అధికారులను కోరింది. రెండేండ్ల క్రితం తన భర్త మొగులయ్య మరణించాడని, ఆయనకు పింఛన్ వచ్చేదని పేర్కొంది. భర్త చనిపోయినప్పటి నుంచి పింఛన్ కోసం ఆఫీసుల చుట్టూ తిరిగినా ఇప్పటికీ మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేసింది. నిరుపేదరాలైన తనకు పింఛన్ మంజూరు చేయాలని కోరింది. ఈమె వెంట వచ్చిన మాజీ సర్పంచ్ రవి పాటిల్, రాజేంద్రపాటిల్ అదనపు కలెక్టర్‌ను కలిసి వెంటనే వితంతు పింఛన్ మంజూరు చేయాలని విన్నవించారు.